సాక్షి
కామారెడ్డి

శనివారం | 16 | డిసెంబర్ | 2023



పనిచేయిస్తే కటకటాలే..

బడిఈడు పిల్లలతో పనులు చేయిస్తే కటకటాల పాలవుతారని సీఆర్‌పీలు హెచ్చరించారు.

- 9లో ▸



ఆదాయం పెంపునకు కృషి

మార్కెట్ కమిటీ ఆదాయం పెంచడానికి కృషి చేస్తామని కామారెడ్డి ఏఎంసీ పాలకవర్గం ప్రతినిధులు పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.2 /14.0

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

పత్తి క్వింటాలుకు రూ. 6,950



మద్నూర్: మద్నూర్ మార్కెట్‌లో శుక్రవారం పత్తి క్వింటాలుకు కనిష్టంగా రూ. 6,800, గరిష్టంగా రూ. 6,950 ధర పలికింది. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు పత్తిని తీసుకువస్తున్నారు. 300 క్వింటాళ్ల పత్తి మార్కెట్‌కు వచ్చిందని అధికారులు తెలిపారు. కాగా మూడు రోజుల క్రితం బీట్ ప్రారంభించిన రోజు వ్యాపారులు క్వింటాలుకు రూ. 7,120 చెల్లించారని, ఇప్పుడు సిండికేటుగా మారి ధర తగ్గించారని రైతులు ఆరోపిస్తున్నారు. గిట్టుబాటు ధర లభించేలా అధికారులు చూడాలని కోరుతున్నారు.

టార్గెట్ బాల్ టోర్నీలో జిల్లావాసికి సిల్వర్ మెడల్



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డికి చెందిన శరత్ కళ్యాణ్ ఇంటర్నేషనల్ టార్గెట్ బాల్ టోర్నీలో సత్తా చాటి సిల్వర్ మెడల్ సాధించాడు. ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు నేపాల్‌లోని ఖాట్మండ్‌లో జరిగిన అండర్ 17 బాలుర విభాగంలో శరత్ కళ్యాణ్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడని అతడి తల్లిదండ్రులు తెలిపారు. ఇందులో ప్రతిభ చూపడంతో సిల్వర్ మెడల్ దక్కిందన్నారు.

'క్రాస్ కంట్రీ' పోటీలకు 18 మంది ఎంపిక



కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో శుక్రవారం జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన 18 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. వీరు ఈనెల 23న కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొంటారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్, అసోసియేషన్ ప్రతినిధులు అతీకుల్లా, దత్తు, నవీన్, శ్రీనివాస్, మధుసూదన్, నరేష్‌రెడ్డి, శివాగౌడ్, నరేష్, ప్రియాంక, శ్రావణి, సంజీవ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

కె.అనిల్, డి.జ్ఞానేశ్వర్, ఆర్.రమేష్, జి.శ్యాం కుమార్, జి.సునీత, ఎల్.ప్రసాద్, టి.సురత్ రాం, టి.రామ్, కె.నాగరాజు, కేదార్‌సింగ్, జె.అర్జున్, బి.హరిత, ఎల్.అఖిల, జె.శ్యాం సుందర్, బి.బాబు, కె.నందిని, ఎం.అర్చన బాయి, ఎస్.జ్ఞానేశ్వర్.

జీవన్‌రెడ్డి మాల్‌కు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

- రూ. 1.80 కోట్ల బకాయిలు చెల్లింపు




ఆర్మూర్: పట్టణంలోని జీవన్‌రెడ్డి మాల్‌కు ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్‌ను శుక్రవారం పునరుద్ధరించారు. విద్యుత్ బకాయిలు రూ. 2.57 కోట్లు ఉండడంతో ఈ నెల 7న ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు అదేరోజు రూ. 25లక్షలు చెల్లించారు. ఈ నెల 13న మరో రూ. కోటి 55 లక్షలు చెల్లించారు. బకాయిలు మొత్తం చెల్లిస్తేనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొనడంతో సంస్థ ప్రతినిధులు కోర్టును ఆశ్రయించారు. మూడు వారాల్లో బకాయిలు మొత్తం చెల్లిస్తామని హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించారు. దీంతో హైకోర్టు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. కోర్టు సూచనల మేరకు ఆర్మూర్ ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది మాల్‌కు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

బదిలీ అయినా.. పాతస్థానమే!

- కొలిక్కిరాని ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ
- రిలీవర్ లేకపోవడంతో రిలీవ్ కాలేకపోతున్న టీచర్లు
- ప్రత్యామ్నాయం చూడాలని విజ్ఞప్తి

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ జరిగి మూడు నెలలవుతున్నా కొందరు ఉపాధ్యాయులు పాత స్థానంలోనే పనిచేయాల్సి వస్తోంది. వారి స్థానంలో వేరే టీచర్లు రాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో బదిలీ అయిన ఆనందం లేకుండాపోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి, కామారెడ్డి



జిల్లాలో సెప్టెంబర్‌లో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ నిర్వహించారు. 790 మంది టీచర్లు బదిలీ అయ్యారు. ఇందులో 290 మంది టీచర్లు ఇప్పటికీ వారు పనిచేస్తున్న పాత స్కూళ్లోనే డ్యూటీ చేస్తున్నారు. రిలీవర్ లేకపోవడంతో వారు పాత స్థానంలోనే పనిచేయాల్సి వస్తోంది. ఈ విషయంలో కొందరు టీచర్లు కోర్టులకు కూడా వెళ్లారు. రిలీవర్ రాకున్నా బదిలీ అయిన స్థానానికి పంపాల్సిందేనని ఉపాధ్యాయులు వాదిస్తున్నారు. అయితే బదిలీ అయిన ఉపాధ్యాయుడి స్థానంలో వేరే టీచర్ రాకపోతే విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు ఉండరని అధికారులు అంటున్నారు. కనీసం బదిలీ అయిన ఉపాధ్యాయుడిని రిలీవ్ చేసి వారి స్థానంలో విద్యావలంటీర్లను నియమించుకోవాలనుకున్నా.. ప్రభుత్వం విద్యావలంటీర్లను ఇవ్వడం లేదు. దీంతో బదిలీ అయ్యి మూడు నెలలవుతున్నా చాలా మంది టీచర్లు రిలీవ్ కాలేకపోతున్నారు. బదిలీ అయినా లాభం లేకుండాపోయిందని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఉపాధాయులు పలుకుబడి ఉపయోగించుకుని రిలీవర్ రాకున్నా ప్రత్యామ్నాయ మార్గాలను చూపించి బయటపడ్డారు కానీ అత్యధికులు రిలీవర్ రాకకోసం ఎదురు చూస్తున్నారు.

ప్రత్యామ్నాయం చూడాలన్న డిమాండ్..

దూర ప్రాంతాల్లో ఏళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎప్పుడు బయటపడదామా అని ఎదురు చూశారు. బదిలీల ప్రక్రియ మొదలవడంతో తాము అనుకూల పోస్టింగుల్లోకి వెళతామని ఆశించారు. అనుకున్నట్టే వారికి అవకాశం దక్కింది. కానీ వారి స్థానంలో రిలీవర్ రాకపోవడంతో వదిలివెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన ప్రక్రియ చేపట్టి మూడు నెలలు గడుస్తున్నా చాలామంది రిలీవర్‌లు లేక బదిలీ అయిన చోటుకు వెళ్లలేకపోతున్నారు. దీంతో బదిలీ అయిన వారి స్థానంలో రిలీవర్ లేని పక్షంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

కొన్నిచోట్ల విద్యార్థులు లేకున్నా టీచర్లు ఉన్నారు. అలాంటి వారిని అవసరం ఉన్న చోటుకు డిప్యుటేషన్‌పై సర్దుబాటు చేయాలని కోరుతున్నారు. అయితే విద్యార్థులు తక్కువ ఉన్నచోట పనిచేస్తున్న ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌కు సుముఖంగా లేరని తెలుస్తోంది. దీంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. రెండు నెలలుగా ఎన్నికల కోడ్ మూలంగా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దానికితోడు ప్రభుత్వం కూడా మారిపోయింది. ఈ నేపథ్యంలో బదిలీ అయినా రిలీవ్ కాలేకపోయిన ఉపాధ్యాయుల అంశం మీద కొత్త ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతుందన్న దానిపై ఆసక్తి నెలకొంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ అంతా సజావుగానే జరిగింది. బదిలీ అయిన వారి స్థానంలో రిలీవర్ రాకపోవడంతో కొన్నిచోట్ల ఇబ్బందులు ఎదురయ్యాయి. మామీద టీచర్ల వైపు నుంచి తీవ్ర ఒత్తిడి ఉంది. కనీసం విద్యావలంటీర్లు ఉన్నా వారిని నియమించి రిలీవ్ చేసేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.
– ఎస్.రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి, కామారెడ్డి

సీఎంఆర్‌లో దొంగాట!

- మాజీ ఎమ్మెల్యే షకీల్ మిల్లులకు 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయింపు
- తిరిగివ్వాల్సింది 35వేల మెట్రిక్ టన్నుల బియ్యం
- ఇచ్చింది 5వేల మెట్రిక్ టన్నులే..!
- ఇతర మిల్లులకు ధాన్యం ఇచ్చినట్లు లెక్కలు
- ధాన్యం విలువ రూ. 60 కోట్ల పైమాటే..
- తనిఖీలు చేపట్టిన పౌరసరఫరాల అధికారులు



షకీల్ మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ చేసిన అక్రమాలు బయటకు వస్తున్నాయి. అధికారంలో ఉన్నాం.. మనకేం అవుతుంది.. మనల్ని ఎవరు అడుగుతారనే ధీమాతో ధాన్యం మిల్లింగ్‌ను ఒక మాఫియాగా మార్చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. బోధన్‌లోని మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు చెందిన రహీల్, రాస్, అమీర్, దాన్విక్ అనే నాలుగు రైస్‌మిల్లులకు 2021–22 యాసంగి, 2022–23 వానాకాలం సీజన్‌లకు సంబంధించి పౌరసరఫరాల శాఖ ద్వారా 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చారు. ఇందుకుగాను 35వేల మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్(కస్టం మిల్లింగ్ రైస్) కింద తిరిగి పౌరసరఫరాల శాఖకు తిరిగి ఇవ్వాల్సి ఉంది. అయితే కేవలం 5వేల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే తిరిగిచ్చారు.

మిగిలిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇవ్వడం తనకు సాధ్యం కాదని షకీల్ చెప్పారు. ఈ నేపథ్యంలో మిగిలిన ధాన్యాన్ని ఏఆర్ ఇండస్ట్రీస్(ఎడపల్లి), ఆర్‌కామ్ ఇండస్ట్రీస్(వర్ని), అబ్దుల్ ఐ ఇండస్ట్రీస్(వర్ని), ఎఫ్‌టీఏఫ్ ఇండస్ట్రీస్(బోధన్) అనే మరో నాలుగు మిల్లులకు కేటాయించినట్లు చూపించారు. ఇందుకు సంబంధించి ధాన్యం తమ మిల్లులకు బదిలీ అయినట్లు ఆ నాలుగు మిల్లులకు చెందిన యజమానులు లిఖితపూర్వకంగా రాసిచ్చారు. ఇందులో ఏఆర్ ఇండస్ట్రీస్ నుంచి 2,000 మెట్రిక్ టన్నులు, ఆర్‌కామ్ నుంచి 1,000 మెట్రిక్ టన్నులు, అబ్దుల్ ఐ నుంచి 1,000 మెట్రిక్ టన్నుల బియ్యం(సీఎంఆర్) మాత్రమే పౌరసరఫరాల శాఖకు ఇవ్వడం జరిగింది. ఎఫ్‌టీఏఫ్ ఇండస్ట్రీస్ నుంచి ఒక్క గింజ కూడా ఇవ్వలేదు. మిగిలిన 26వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ అధికారులు అడగగా, షకీల్ మిల్లుల నుంచి తమకు ధాన్యం రాలేదని చెబుతుండడం గమనార్హం.

మాజీ ఎమ్మెల్యే షకీల్ ఒత్తిడితోనే ధాన్యం బదిలీ అయినట్లు తాము రాసిచ్చామని మిల్లర్లు చెబుతుండడం విశేషం. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు షకీల్‌కు చెందిన మిల్లుల్లో తనిఖీలు చేస్తున్నారు. రెండు రోజుల్లో ధాన్యం, సీఎంఆర్‌కు సంబంధించిన వివరాలు బయటకు వచ్చే అవకాశాలున్నాయి. పౌరసరఫరాల శాఖకు ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యం విలువ సుమారు రూ. 60 కోట్లు ఉండడం గమనార్హం. కాగా సీఎంఆర్ ఇవ్వనందుకుగాను పౌరసరఫరాల శాఖ ఇప్పటికే షకీల్‌కు చెందిన మిల్లులకు రూ. 10 కోట్లు జరిమానా విధించారు. ఈ జరిమానా సైతం చెల్లించలేదు.

'ఉన్నత శిఖరాలను అధిరోహించాలి'



దివ్యాంగులను సన్మానించిన అధికారులు

కామారెడ్డి క్రైం: దివ్యాంగులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బావయ్య సూచించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో రెండు రోజుల క్రితం దివ్యాంగుల క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందించారు. ఈ సందర్భంగా బావయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ప్రతిభ ఉంటుందన్నారు. దివ్యాంగులు స్వయం ఉపాధి రంగాలను ఎంచుకోవడం ద్వారా మరో 10 మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. స్వయం ఉపాధి పథకాలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం వివిధ రంగాలలో రాణించిన దివ్యాంగులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా భవిత కేంద్రం సమన్వయకర్త శ్రీపతి, స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఐకేపీ డీపీఎం రమేష్ బాబు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు బాల్‌రెడ్డి, దుర్గ ప్రసాద్, పోచవ్వ, హరిసింగ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' డబ్బుల కోసం రాస్తారోకో

- ఐదు నెలలుగా వేచి చూస్తున్న కూలీలు
- పోస్టాఫీసుల చుట్టూ చక్కర్లు
- పోస్టల్ సిబ్బంది పనితీరుపై ఆగ్రహం



రాస్తారోకో చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

సదాశివనగర్: ఐదు నెలలుగా ఉపాధి డబ్బులు అందకపోవడంతో శుక్రవారం మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌ను ఉపాధి కూలీలు ముట్టడించారు. కూలి డబ్బులు చెల్లించాలంటూ రాస్తారోకోకు దిగారు. డబ్బులు చెల్లించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారో చెప్పాలని పోస్టల్ సిబ్బందిని ప్రశ్నించారు. సమస్యను ఎంపీడీవో లక్ష్మి, సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డిలకు వివరించారు. వారు పోస్టాఫీస్ కార్యాలయానికి వచ్చి కూలీలకు చెల్లించాల్సిన డబ్బుల విషయమై ఆరా తీశారు. దీంతో సోమవారం వరకు కూలీలకు డబ్బులు చెల్లించేలా చూస్తామని పోస్టల్ సిబ్బంది హామీ ఇవ్వడంతో కూలీలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఏపీవో మధు, ఫీల్డ్‌అసిస్టెంట్ అశోక్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి పులి

- వసతి గృహాల్లో అరకొర వసతులు
- దోమల బెడదతోనూ ఇబ్బందిపడుతున్న విద్యార్థులు



నిజాంసాగర్‌లో చిరిగిపోయిన కిటికీ మెష్



లింగంపేట బీసీ బాలుర హాస్టల్‌లో ఇంటినుంచి తెచ్చుకున్న రగ్గులు కప్పుకున్న విద్యార్థులు

నిజాంసాగర్: ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు చలికి వణుకుతున్నారు. విద్యార్థులకు పలుచని బ్లాంకెట్లను అందించడంతో అవి చలిని ఆపలేకపోతున్నాయి. గురువారం రాత్రి నిజాంసాగర్‌లోని బీసీ వసతి గృహంతోపాటు పిట్లం, పెద్దకొడప్‌గల్, మద్నూర్, బిచ్కుంద మండలాల్లోని వసతి గృహాలను 'సాక్షి' విజిట్ చేసింది. నిజాంసాగర్ బీసీ వసతి గృహంలో కిటికీలకు దోమ తెరలులేవు. ఈ హాస్టల్‌లో వార్డెన్ సైతం అందుబాటులో లేరు. పిట్లం మండల కేంద్రంలోని ఎస్టీ వసతి గృహంలో 130 మంది విద్యార్థులున్నారు. కొత్తగా చేరిన విద్యార్థులకు పలుచని దుప్పట్లు ఇవ్వడంతో వారు చలిని తట్టుకోలేకపోతున్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గ్రామపంచాయతీ ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. వేడి నీళ్ల సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు చల్లటి నీటితోనే స్నానం చేయాల్సి వస్తోంది. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు అందించారు. మద్నూర్, బిచ్కుంద మండలాల్లోని వసతి గృహాల విద్యార్థులకు దుప్పట్లు, బ్లాంకెట్లను ప్రభుత్వం సరఫరా చేసింది.

SAKSHI VISIT సాక్షి విజిట్

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): చలితీవ్రత పెరగడంతో హాస్టళ్లలోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది జిల్లాలోని కొన్ని హాస్టళ్లకు మాత్రమే ప్రభుత్వం దుప్పట్లు అందించింది. దుప్పట్లు అందనివారు గతేడాది సరఫరా చేసిన, ఇంటినుంచి తెచ్చుకున్న దుప్పట్లను వినియోగిస్తున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు ఈ ఏడాది దుప్పట్లను సరఫరా చేయలేదు. దీంతో విద్యార్థులు వారి ఇళ్ల నుంచి తెచ్చుకున్న దుప్పట్లను వినియోగిస్తున్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌తో పాటు సదాశివనగర్‌లోని బీసీ బాలుర హాస్టల్ లోనూ దుప్పట్లు అందించలేదు. ఎల్లారెడ్డి మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో, తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఈసారి దుప్పట్లు పంపిణీ చేశారు.



పిట్లం వసతి గృహంలో నిద్రిస్తున్న విద్యార్థులు

అవిశ్వాసాన్ని అడ్డుకునేందుకే అపహరించారా?

- మాక్లూర్ ఎంపీటీసీ–2 కిడ్నాప్‌పై అనుమానాలు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- సీపీకి బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు



సీపీకి ఫిర్యాదు చేసిన ఎంపీటీసీ మీరాబాయి కుటుంబ సభ్యులు

ఖలీల్‌వాడి: మాక్లూర్ ఎంపీటీసీ–2 సభ్యురాలు మీరాబాయి కిడ్నాప్ ఘటన జిల్లాలో కలకలం రేపిన విషయం తెలిసిందే. అయితే తనపై అవిశ్వాసం పెడతారని.. దానిని అడ్డుకునేందుకే మాక్లూర్ ఎంపీపీ మాస్త ప్రభాకర్ ఆమెను కిడ్నాప్ చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిషత్ ఎన్నికల్లో ఎంపీటీసీలుగా గెలిచిన ప్రభాకర్, మీరాబాయి చెరో రెండున్నరేళ్లు ఎంపీపీగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం ప్రభాకర్ ఎంపీపీ పదవి గడువు ముగిసింది. మరోవైపు జీవన్‌రెడ్డి ఓటమి పాలవడంతో ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం తెరపైకి వచ్చింది. దీంతో ప్రభాకర్ ఎంపీటీసీ మీరాబాయిని కిడ్నాప్ చేశారని ప్రచారం జరుగుతోంది. ఆమె ఈ నెల 10న కిడ్నాప్ కాగా కుటుంబ సభ్యులు మాక్లూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ, పోలీసులకు ప్రభాకర్ వర్గం ఓ వీడియోను పంపినట్లు సమాచారం. అందుకే పోలీసులు పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక పోలీసులు స్పందించకపోవడంతో ఎంపీటీసీ కుటుంబ సభ్యులు శుక్రవారం సీపీకి ఫిర్యాదు చేశారు. ఈనెల 10న ఎంపీపీతో మరికొందరు తమ నివాసానికి వచ్చి నా భార్య మీరాబాయిని కిడ్నాప్ చేశారని ఎంపీటీసీ భర్త నారాయణ సీపీకి వివరించారు. ఈ విషయమై మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఆమెను వెంటనే విడిపించాలని వేడుకున్నారు. మీరాబాయిని విడిపించకపోతే కుటుంబమంతా ఆత్మహత్య చేసుకుంటామన్నారు.

ఎంపీటీసీని వదిలిపెట్టాలి

ఎంపీటీసీ మీరాబాయిని వదిలి పెట్టకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కోటగిరి లక్ష్మి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వెంటనే బాధ్యులైన ఎంపీపీ ప్రభాకర్, రంజిత్, వైస్ ఎంపీపీ భర్త సుక్కి సుధాకర్, డ్రైవర్ బక్క శ్రీనులపై కిడ్నాప్, అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం ఆదుకోకుంటే ఆందోళన చేస్తాం



పెద్దమల్లారెడ్డిలో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు



జిల్లా కేంద్రంలో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్ల హెచ్చరిక

కామారెడ్డి టౌన్: తెలంగాణ ప్రభుత్వం తమను అన్ని విధాల ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి కారణంగా తమ ఆదాయం పూర్తిగా పడిపోయిందన్నారు. రోజంతా కష్టపడితే రూ.300 నుంచి రూ.600 వరకు ఆదాయం వస్తుండేదని, ప్రస్తుతం రూ.200 కూడా రావడం లేదని తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే తమకు జీవనోపాధి కింద రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రత్యేక కార్యాచరణతో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

పెద్దమల్లారెడ్డి గ్రామంలో..

భిక్కనూరు: మహాలక్ష్మి పథకంతో తామందరం కుటుంబంతో కలిసి వీధుల్లో పడ్డామంటూ భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఆటోడ్రైవర్లు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని గాంధీ చౌక్‌వద్ద ఆటోలను నిలిపి గంట సేపు ఆందోళన చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పిట్లంలో..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం వద్ద శుక్రవారం తెలంగాణ ఆటో ట్రేడ్ యూనియన్(టీఏటీయూ) ఆధ్వర్యంలో మండల ఆటో డ్రైవర్లు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఉప తహసీల్దార్ నరేష్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో పాటు నెలకు రూ.10 వేల పింఛను అమలు చేయాలని కోరారు.

క్లుప్తంగా

బాలస్వామికి డాక్టరేట్



తెయూ: తెయూ తెలుగు విభాగంలో పరిశోధక విద్యార్థి అంతటి బాలస్వామి పీహెచ్‌డీ సాధించారు. అధ్యాపకులు సీహెచ్ లక్ష్మణ చక్రవర్తి పర్యవేక్షణలో 'తెలుగులో షష్టిపూర్తి సంచికలు – పరిశీలన' అనే అంశంపై బాలస్వామి సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించి సమర్పించారు. కార్యక్రమంలో ఓయూ తెలుగు విభాగం ప్రొఫెసర్ సాగి కమలాకరశర్మ, తెయూ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ వి.త్రివేణి చైర్మన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి లావణ్య, కనకయ్య, ప్రిన్సిపల్ ఆరతి, కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ, లక్ష్మణచక్రవర్తి, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యానికి మేలు



నిజామాబాద్‌నాగారం: క్రీడలతో ఆరోగ్యానికి మేలు కలుగుతుందని డీసీపీ జయరాం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో విశ్రాంత ఉద్యోగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం డీసీపీని రిటైర్డ్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి భోజాగౌడ్, కోశాధికారి ఆశయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పండరినాథ్, దారం గంగాధర్, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

శివాజీనగర్‌లో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని శివాజీనగర్‌లో చోరీ జరిగినట్లు రెండో టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. స్థానికంగా నివాసం ఉంటున్న గోప్ప గంగమ్మ అనే వృద్ధురాలి ఇంట్లో గుర్తు తెలియని దుండగుడు ప్రవేశించి ఐదు తులాల బంగారంతో పాటు రూ. పదివేల గనదును ఎత్తుకెళ్లాడు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

వసతిగృహాల్లో దుప్పట్ల కొరత

సంక్షేమ వసతి గృహాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చలి కాలంలో వారికి సరిపడా దుప్పట్లు లేక గజగజ వణుకుతున్నారు. గదులకు సరైన డోర్లు లేక, కిటికీలు విరిగిపోయి చలిగాలుల మధ్య వణుకుతూ పడుకుంటున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఎస్టీ వసతి గృహంలో ఇంటినుంచి తెచ్చుకున్న దుప్పట్లు కప్పుకున్న విద్యార్థులు



నవీపేటలోని బీసీ బాలుర హాస్టల్‌లో పాత దుప్పట్లు కప్పుకుని నిద్రిస్తున్న విద్యార్థులు





నాందేవ్‌వాడ ఎస్సీ హాస్టల్‌లో విరిగిన తలుపులు




వర్ని ఎస్సీ బాలుర హాస్టల్‌లో చలిలో బయట భోజనాలు చేస్తున్న విద్యార్థులు





ఎస్సీ వసతి గృహంలో ధ్వంసమైన బాత్‌రూమ్ తలుపులు



సిరికొండలోని గిరిజన పాఠశాల హాస్టల్‌లో తలుపులు లేని కిటికీ



వసతి గృహంలో ధ్వంసమైన కిటికీలు

మంచుకురిసే వేళలో..



జాతీయ రహదారిపై కమ్ముకున్న పొగమంచు

జిల్లాలో గత మూడు రోజుల నుంచి చలితీవ్రత పెరుగుతోంది. శుక్రవారం పొగమంచు పేరుకుపోవడంతో వేకువజామున 44వ జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లైట్లు వేసుకొని ప్రయాణించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

బకాయిలు విడుదల చేయాలి

బాన్సువాడ: స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కామారెడ్డి జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలన్నారు. నేతలు విజయ్, నిఖిల్, రాఘవ, నవీన్, రాజు, విష్ణు, సాయి ఉన్నారు.

అయ్యప్ప ఆలయాన్ని సందర్శించిన ఎన్‌ఆర్‌ఐలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయాన్ని అమెరికాలోని అయ్యప్పస్వాములు శుక్రవారం సందర్శించారు. అమెరికాలో నివసిస్తున్న గురుస్వామి విశ్వభరత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు ఎన్‌ఆర్‌ఐలు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు ఇంద్రకరణ్‌రెడ్డి, భీం రెడ్డి, బల్యాల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదకు చెక్



అన్నారంలో ఇంటిపై బిగించిన ఇనుప రేకులు

రామారెడ్డి: కోతుల బెడదతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇండ్లపైకి ఎక్కి కూనపెంకలను తీసేస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు తమ ఇళ్లపై కూన పెంకలకు బదులు ఇనుపవి బిగిస్తున్నారు. ఇనుప వాటితో ఇబ్బంది ఉండదని ప్రజలు పేర్కొంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పెంకుటిల్లు ఉన్న ప్రజలు ఇలా ఇనుపవాటిని వేయిస్తున్నారు.

జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



క్రీడాకారులతో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు

హాకీ పోటీలకు తూంపల్లి విదార్థులు



హాకీ పోటీలకు ఎంపికైన సిరికొండ క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి యోగా పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. నగరంలోని యోగా కేంద్రంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 20వరకు పంజాబ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు సబ్‌జూనియర్, జూనియర్ విభాగాల్లో బాలబాలికలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో స్రుజన్ కుమార్, నిర్ణయ, హసిత, హసిని, త్రివేణి ఉన్నారు. అనంతరం క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచందర్ అభినందించారు.

సిరికొండ గిరిజన పాఠశాల విదార్థులు..

సిరికొండ: మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కల్పన శుక్రవారం తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన ప్రశాంత్, రాహుల్, దినేశ్, చిన్నా వాలీబాల్, కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. భద్రాచలంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను పీడీ ప్రశాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

సత్యశోధక్ పాఠశాలలో..

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు సిరికొండ సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థి రుత్విక్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య శుక్రవారం తెలిపారు. ఆర్మూర్‌లో ఈ నెల 13న నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఈ నెల 16 నుంచి నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడని తెలిపారు. అనంతరం రుత్విక్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

సిరికొండ: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు తూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ నాగేశ్ శుక్రవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో నిర్వహించిన అండర్–17 ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి లోకేశ్, రాహుల్, అఖిల్, విశాల్, రాజు, నవీన్, జశ్వంత్, అక్షయ, శ్రీజ, హారిక, అఖిల, కీర్తన, శివాణి, ప్రణతి, రితీష, శ్రీనిధి రాష్ట్ర ఎంపికైనట్లు పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీ చెప్పారు. అనంతరం విద్యార్థులను సర్పంచ్ బాలమణిమల్లేష్, ఎంపీటీసీ లింగం, హెచ్‌ఎం రాములు, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగారెడ్డి, రమణ, వీడీసీ సభ్యులు అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డిచ్‌పల్లి సీఐ కృష్ణ

తెయూ: విద్యార్థులు అవసరం లేని యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని సైబర్ మోసాలకు గురికావొద్దని డిచ్‌పల్లి సీఐ కృష్ణ సూచించారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో 'సైబర్ సురక్షిత జాతీయ భద్రత' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి సీఐ హాజరై మాట్లాడారు. మితిమీరిన స్మార్ట్ ఫోన్ల వినియోగం అలవాటుగా మారి, వ్యసనంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ ముఖీద్ పాషా మాట్లాడుతూ.. సైబర్ నేరాల బారిన పడిన కొందరు విద్యార్థులు వాటిని బయటకు చెప్పుకోలేక ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా మనోధైర్యంతో సైబర్ నేరాలపై పోలీసులను సంప్రదించాలని సూచించారు. డిచ్‌పల్లి ఎస్సై మహేశ్, తెయూ ప్రిన్సిపాల్ ఆరతి, లా కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు..



సైక్లింగ్ పోటీల్లో క్రీడాకారులు

జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలను కంఠేశ్వర్ బైపాస్‌రోడ్డులో నిర్వహించారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 16 నుంచి 22వరకు ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 22 నుంచి 24వరకు సిద్దిపేట్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలకు ఎంపికైన వారిలో సోహన్, విఘ్నేష్, శివ, హరి, అరూశ్, వెంకటేశ్, మేఘన, జ్యోతి, స్వాతి, తేజస్, గంగాధర్, అన్మోల్, శివచరణ్, ఈశ్వర్, శిల్పచౌహాన్, అక్షర్, రాఘవేంద్ర, సమిత్, నరేశ్‌కుమార్ ఉన్నారు.

అవ్వకు ఎంత కష్టమొచ్చే..



ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు ఎరుకలి సత్యవ్వ. భిక్కనూర్‌కు చెందిన ఈమెకు ఇద్దరు కుమార్తెలు. వారికి వివాహాలు చేసి అత్తగారింటికి పంపింది. ఇటీవల ఆమె కాలు విరిగింది. దీంతో ఆమె ఆలనపాలన చూసేవారు కరువయ్యారు. సొంత ఇల్లు లేక, తినడానికి తిండి లేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. మండల కేంద్రంలోని పలు దుకాణ సముదాయాల ఎదుట ఉంటూ అక్కడే నిద్రిస్తోంది. ఇది చూసిన పలువురు ఆమెను పలు వివరాలు అడుగగా ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాని, కుమార్తెలు పట్టించుకోవడం లేదని, కనీసం ఫోన్ చేసినా స్పందించడం లేదంటూ సత్యవ్వ రోధిస్తూ చెబుతోంది. ఇది చూసిన పలువురు ఈ అవ్వకు ఎంత కష్టమొచ్చే అనిబాధపడ్డారు.

– భిక్కనూరు

క్రైం కార్నర్

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్: అంకాపూర్ శివారులో బైక్ అదుపుతప్పి తోపారం భారత్ (28) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి చేపల వేట కోసం చెరువులో వల వేసి వస్తుండగా అంకాపూర్ శివారులో రాగానే బైక్ అదుపుతప్పి పక్కన ఉన్న పంట పొలాల్లోకి మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బోధన్‌లో ఒకరి ఆత్మహత్యాయత్నం

బోధన్‌టౌన్: పట్టణంలోని బాబు జగ్జీవన్‌రాం విగ్రహం ఎదుట శుక్రవారం ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించినట్లు సీఐ వీరయ్య శుక్రవారం తెలిపారు. రెంజల్‌కు చెందిన గంగాధర్ నిజామాబాద్‌లోని ఓ హోటల్లో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బోధన్‌లోని జగ్జీవన్ రాం విగ్రహం ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేసి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని శ్రీరాంనగర్ తండాకు చెందిన ముగ్గురిపై కేసు నమోదైనట్లు ఎస్‌హెచ్‌ఓ గంగాధర్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన యశోదబాయికి దాయాదులు (పాలోల్లు)తో కొంతకాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈక్రమంలో ఆస్తి విషయంలో మాటామాటా పెరిగి యశోదబాయిపై రాజు, లావణ్య, అక్కుబాయి దాడికి పాల్పడ్డారు. దాడిలో యశోదబాయికి గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి కుమారుడు మురళీ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత



ఖలీల్‌వాడి: నగరంలోని అర్సపల్లిలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఇద్దరి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ విలాస్‌కుమార్ శుక్రవారం తెలిపారు. బైక్‌పై ప్రయాణిస్తున్న సయ్యద్ షఫీ, షేక్ ఆమేర్‌ను తనిఖీ చేయగా 250 గ్రాముల గంజాయి లభ్యమైందన్నారు. నిందితులను అరెస్టు చేసి ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు. ఎక్సైజ్ ఎస్సై గంగాధర్, హెడ్‌కానిస్టేబుల్ సాగర్‌రావు, కానిస్టేబుళ్లు చంద్రమోహన్, కిరణ్ కుమార్, నర్సయ్య చారి, నీలిరాజు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

నస్రుల్లాబాద్: మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన దేవీసింగ్‌ను తహసీల్దార్ రాజు ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. అటవీ చెట్లను నరకడంతో పట్టుకున్న పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండవర్ చేసినట్లు చెప్పారు. మరోమారు అక్రమాలకు పాల్పడితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి మృతి



రమేశ్ (ఫైల్)

లింగంపేట: మండలంలోని పర్మళ్ల గ్రామానికి చెందిన ఈర్ల రమేశ్(24) మద్యం మత్తులో కుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రమేశ్ కొంతకాలంగా మద్యానికి బానిసైనట్లు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన రమేశ్ స్థానిక కుంటలో ఆత్మహత్య చేసుకోగా గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి తల్లి మంజుల, భార్య వనిత, కూతురు లహరి ఉన్నారు.

బ్యాంకు ఉద్యోగి ..

ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్ బ్యాంక్ కాలనీకి చెందిన శ్రీనివాస్(35) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై రాఘవేందర్ శుక్రవారం తెలిపారు. శ్రీనివాస్ కొన్ని రోజులుగా ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతి గల కారణాలను కుటుంబ సభ్యులు వెల్లడించలేదన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

ధర్పల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 14న కుటుంబ సభ్యులు పని నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లడంతో ఇంట్లో ఉన్న యువతి అదృశ్యమైనట్లు చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మొరం టిప్పర్ల సీజ్



నస్రుల్లాబాద్: మండలంలోని రాముల గుట్ట తండా శివారులో శుక్రవారం మొరాన్ని అక్రమంగా తరలిస్తున్న జేసీబీలు ,టిప్పర్లను తహసీల్దార్ రాజు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొరం తరలిస్తున్నట్లు ముందుస్తు సమాచారం అందంతో ఘటనా స్థలానికి సిబ్బందిని పంపించి 4టిప్పర్లు, 2జేసీబిలను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తరలించినట్లు పేర్కొన్నారు. వాల్టా చట్టం ప్రకారం అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాని తెలిపారు.